# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 11-05-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆధ్యాత్మిక చైతన్యానికి భారత్ నిలయమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.**

2. **ఢిల్లీలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో ఈరోజు సమావేశమయ్యారు.**

3. **ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చెప్పారు.**

4. **గ్రామీణాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.**

5. **రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ వెల్లడించారు.**

==========================

ఆధ్యాత్మిక చైతన్యానికి భారత్ నిలయమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. గుజరాత్‌లోని సోమనాధ్ ఆలయ పునర్నిర్మాణానికి 75 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా ఈరోజు ఆలయంలో నిర్వహించిన కుంభాభిషేక క్రతువులో పాల్గొన్నారు. అనంతరం ప్రధానమంత్రి మాట్లాడుతూ.. అభివృద్ధితో పాటు సాంస్కృతిక పరిరక్షణ అవసరమని తెలిపారు. సోమనాధ్ ఆలయ పునర్నిర్మాణానికి సర్దార్ వల్లభ భాయ్ పటేల్ విశేష కృషి చేశారని పేర్కొంటూ...

..వాయిస్...25 సెకన్లు

--------------------------

ఢిల్లీలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో ఈరోజు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులు, కేంద్ర నిధుల అంశాలపై చర్చించారు. అనంతరం కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ తో సమావేశమై పోలవరం ప్రాజెక్టుతో పాటు పలు నీటి ప్రాజెక్టులపై చర్చించారు. మధ్యాహ్నం ప్రపంచ బ్యాంకు ప్రతినిధులతో ముఖ్యమంత్రి సమావేశమవుతారు. సాయంత్రం ఢిల్లీలో నిర్వహించే భారత పరిశ్రమల సమాఖ్య-సిఐఐ వాణిజ్య సదస్సులో పాల్గొంటారు. తర్వాత ప్రధాని ఆర్థిక సలహా మండలి చైర్మన్ ఎస్. మహేంద్రదేవ్‌తో పాటు నీతిఆయోగ్ సభ్యులతో

ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు.

---------------------------

ప్రవాసాంధ్రులు రాష్ట్రానికి బ్రాండ్ అంబాసిడర్లుగా మారాలని ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. సింగపూర్ పర్యటనలో భాగంగా సింగపూర్ విమానాశ్రయానికి చేరుకున్న మంత్రికి అక్కడి తెలుగు వారు స్వాగతం పలికారు. అనంతరం ఎన్నారైలతో సమావేశమైన మంత్రి రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడుల గురించి వివరించారు. తెలుగు వారు పనిచేస్తున్న సంస్థల్లో రాష్ట్రంలోని పెట్టుబడి అవకాశాలు, పారిశ్రామికాభివృద్ధిపై ప్రస్తావించాలని కోరారు. రాష్ట్రానికి రాయల్ ఎన్ ఫీల్డ్ సంస్థ రానుండటంపై హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించే లక్ష్యంతో మంత్రి లోకేష్ సింగపూర్ లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు పారిశ్రామికవేత్తలు, బహుళ జాతీయ సంస్థల ప్రతినిధులతో సమావేశం కానున్నారని అధికారులు తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో 700 ఆలయాలను 823 కోట్ల రూపాయల వ్యయంతో పునరుద్ధరిస్తున్నామని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. నెల్లూరులోని శ్రీ తల్పగిరి రంగనాథ స్వామి వారి ఆలయం పాలకమండలి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మంత్రి నారాయణతో కలిసి ఆయన నిన్న పాల్గొన్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రాచీన ఆలయాల ఆధునికీకరణకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అలాగే పుష్కరాల నాటికి ఆలయాలను సిద్ధం చేస్తామని మంత్రి తెలియజేస్తూ..

వాయిస్ ..30.. సెకన్లు

---------------------------

శ్రీకాకుళం జిల్లా టెక్కలి ప్రభుత్వ ఆసుపత్రిని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఈరోజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో వైద్య సేవల తీరును పరిశీలించారు. ఆసుపత్రిలో పరిశుభ్రత, సౌచాలయాల నిర్వహణ వంటి అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఓపీ సేవలు, రోగులకు అందుతున్న సౌకర్యాలపై మంత్రి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ లక్ష్యమని, ఆస్పత్రి నిర్వహణలో నిర్లక్ష్యం సహించబోమని మంత్రి స్పష్టం చేశారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

ప్రజల సంక్షేమం, గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలంలోని అడవి పాలెం, కాజ వెస్ట్, కొంతేరు, చించినాడ, కలగంపూడి, నవరసపురం, ఏనుగు వానిలంక, బాడవ గ్రామాల్లో ఐదు కోట్ల 62 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆయన నిన్న శంకుస్థాపనలు చేశారు. అనంతరం నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ, నియోజకవర్గంలోని ప్రతి రహదారిని కచ్చా రహదారిగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. కర్నూలులో నిర్వహిస్తున్నవేసవి క్రీడా శిక్షణా శిబిరాన్ని శాప్ చైర్మన్ ఏ.రవి నాయుడుతో కలిసి ఈ రోజు సందర్శించారు. ఈ సందర్భంగా క్రీడా సదుపాయాలపై శిక్షణా శిబిరంలో పాల్గొంటున్న క్రీడాకారులతో చర్చించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ క్రీడల్లో పాల్గొనాలని, ప్రతిరోజూ వ్యాయామం చేసే వారు మరింత ఉత్సాహంగా ఉంటారని పేర్కొన్నారు. కర్నూలులోని క్రీడా వసతి గృహాన్ని ఎక్కడికీ తరలించడం లేదని స్పష్టం

చేశారు. కర్నూలు స్టేడియంలో ప్రపంచ స్థాయి సౌకర్యాలు కల్పిస్తున్నామని, పార్కులను కూడా వ్యాయామానికి అనుకూలంగా అభివృద్ధి చేస్తున్నామని మంత్రి టీజీ భరత్ వెల్లడించారు.

---------------------------

సోమనాథ్ ఆలయం భారతీయ ఆత్మగౌరవానికి నిదర్శనమని రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణానికి ఈ రోజుతో 75 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా ఆమె సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించారు. ఉక్కు మనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్ సంకల్పంతో పునర్నిర్మితమైన సోమనాథ్ జ్యోతిర్లింగం భారత సాంస్కృతిక పునరుజ్జీవనానికి స్ఫూర్తిగా నిలిచిందని అన్నారు. 1951లో ప్రారంభమైన సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణం 75 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా, ఈరోజు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమనాథ్ క్షేత్రాన్ని సందర్శించడం ప్రతి భారతీయునికి గర్వకారణమని ఆమె పేర్కొన్నారు.

---------------------------

గుజరాత్‌లోని సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణానికి 75 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా కేంద్ర సాంస్కృతిక శాఖ దేశవ్యాప్తంగా “సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్” కార్యక్రమాలను నిర్వహిస్తోంది ఇందులో భాగంగా నంద్యాల జిల్లాలోని శ్రీశైలం దేవస్థానంలో కలశయాత్ర కార్యక్రమాన్నిఈరోజు నిర్వహించారు. గంగాధరమండపం వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం ఆలయం వద్ద ప్రత్యేక వేదికపై భజనలు, భక్తి గేయాలు, పేరణి శివతాండవం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో ఇంజనీరింగ్, వ్యవసాయ, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ఉమ్మడి ప్రవేశ పరీక్ష – ఏపీఈఏపీసెట్ –2026 పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తిచేశామని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యదర్శి బి. తిరుపతి రావు ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ ఆధారిత విధానంలో పరీక్షలు రెండు విడతలుగా రేపటి నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 48 పట్టణాల్లో 142 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని చెప్పారు. ఏపీఈఏపీసెట్‌కు ఈ ఏడాది మొత్తం 3 లక్షల 55 వేల 11 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు.

---------------------------

విద్యావ్యవస్థ బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంస్కరణలు చేపడుతోందని విజయవాడ తూర్పు శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ తెలిపారు. పదవ తరగతిలో ప్రభుత్వ పాఠశాలల్లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులను విజయవాడలో ఆయన ఈరోజు సత్కరించారు. అలాగే నలభై మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి ఐదు వేల రూపాయల చొప్పున నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ సందర్భంగా గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ, ఉపాధ్యాయ నియామకాలు, బదిలీల్లో పారదర్శక విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. వంద రోజుల కార్యాచరణతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని పేర్కొన్నారు.

======================